క్లుప్తంగా

ఘనంగా గణేష్ నిమజ్జనం

కార్వేటినగరం : వినాయక చవితి వేడుకల్లో భాగంగా కార్వేటినగరంలో కొలువుదీర్చిన గణేష్ ప్రతిమలను శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన ఉట్లోత్సవం ఉత్సాహం పంచింది. డీజే పాటలకు యువత ఉర్రూతలూగింది. నిమజ్జనోత్సవంలో పాలుపంచుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వినాయకస్వామిని పూజించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

24 నుంచి పొలం పిలుస్తోంది

నగరి : మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కబ్జాదారుడికి ప్రాధాన్యంపై ఆగ్రహం



ఎమ్మెల్యే థామస్‌తో వాగ్వాదానికి దిగిన టీడీపీ నేతలు

కార్వేటినగరం : భూకబ్జాలకు పాల్పడుతున్న వారికి ప్రాధాన్యమిస్తుండడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. శనివారం ఎస్ఆర్ పురం మండలం నెళవాయిలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమలంలో ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 3.5 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించిన జనసేన నేత లోకనాథరెడ్డికి ఎమ్మెల్యే థామస్ వత్తాసు పలుకుతున్నారని స్థానిక టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. కబ్జాలకు స్థానమేలేదని చెబుతూ, చుట్టూ వాళ్లనే పెట్టుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

పిడుగు పాటుకు తెగిన విద్యుత్ తీగలు



కాలిపోతున్న కొబ్బరి చెట్టు

నింద్ర: మండలంలోని మేళంబాకం ఎస్టీ కాలనీలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడింది. దీంతో హరికృష్ణకు చెందిన కొబ్బరి చెట్టు దగ్ధం అయింది. పక్కనే వున్న విద్యుత్ తీగలు తెగిపోవడంతో హరికృష్ణ విద్యుత్ మీటరు తీగలు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

సారా విక్రేత అరెస్ట్



సారా విక్రేతను పట్టుకున్న పోలీసులు

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ దళితవాడలో శనివారం నిర్వహించిన ఆకస్మిక దాడిలో ఐదు లీటర్ల సారా ఊట స్వాధీనం చేసుకొని గోపిని అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీ నిర్వహించామన్నారు.

బాధ్యతగా పిల్లలను చదివించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ హేమలత

పాలసముద్రం : తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను ఇంటి వద్ద చదివించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత సూచించారు. శనివారం కళాశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో బోధించిన పాఠాలను ఇంటి వద్ద తప్పనిసరిగా చదువుకుంటేనే మంచి మార్కులు సాధించగలరని తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందించారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పూతలపట్టు : క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఆరోగ్యంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు మనోహర్ అన్నారు. నియోజకవర్గ స్థాయి ఎస్‌జీటీ క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయులు మనోహర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి కృష్ణయ్య, డిల్లీరాణి, కృష్ణమూర్తి, లోకనాథరెడ్డి, మోహన్,హరి, అరుణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలలు.. అందని వేతనాలు

- జీతం కోసం ఆయాలు, వాచ్‌మన్‌ల ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు



పాలసముద్రం ఉన్నత పాఠశాల వద్ద విధుల్లో వాచ్‌మన్

పాలసముద్రం : జీడీ నెల్లూరు నియోజకవర్గంలో మొత్తం 415 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మన్‌లకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. పొట్టకూటి కష్టపడుతున్న చిరుజీవులు ఏప్రిల్ నుంచి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.6వేల చొప్పున మొత్తం రూ.36వేలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలవారీగా జీతాలు ఇవ్వకపోడంతో అప్పు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని ఆయాలు, వాచ్‌మన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వేతనాలు మంజూరు చేయించాలని కోరుతున్నారు.



పాఠశాలలో పనిచేస్తున్న ఆయా

దుర్భరంగా జీవనం



ఆరునెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణం. ప్రభుత్వం ఇలా వ్యవహరించడం అన్యాయం. దీంతో వారి జీవనం దుర్భరంగా మారిపోయింది. అప్పుల పాలవుతున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలి. – రవి, సీఐటీయూ నేత

నానా అవస్థలు పడుతున్నాం



జీతం మీద ఆధారపడి బతికేవాళ్లం. సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతో నానా అవస్థలు పడుతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే విధులు నిర్వర్తిస్తుంటాం. వేరే పని చేసుకునే అవకాశం కూడా ఉండదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా మా ఇబ్బందులను ఆలకించాలి. జీతాలు మంజూరు చేయాలి. – చిన్నా, ఆయా, పాలసముద్రం

నివేదిక పంపుతున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వాచ్‌మన్‌ల జీతాల కోసం ప్రతి నెలా ప్రధానోపాధ్యాయులు నివేదిక పంపుతున్నారు. ఉన్నతాధికారులకు అప్‌డేట్ చేస్తున్నారు. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. ఈ మేరకు మేము సైతం కృషి చేస్తున్నాం. నిధులు రాగానే ప్రతి ఒక్కరి ఖాతాల్లో నగదు జమ చేస్తాం. – రాజేంద్రప్రసాద్, ఎంఈఓ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయపురం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూపర్‌వైజర్ మురళి అన్నారు. పాతర్కాడులో శనివారం వైద్య సేవలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వానాకాలంలో మలేరియా, పైలేరియా, మెదడు వాపు, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించి శుభ్రం చేయడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. శుభ్రమైన ఆహారాన్ని తినాలని, ఆకుకూరలు, కూరగాయలు వండే ముందు శుభ్రంగా కడగాలని, ఉడికించిన ఆహారాన్ని తినాలని అన్నారు. ప్రతి ఆదివారం పది నిమిషాల సమయాన్ని కేటాయించి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రోగులను పరిశీలించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మునెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలసముద్రం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సూచించారు. శనివారం వనదుర్గాపురం సచివాలయ ఆవరణలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రమేష్ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు తీసుకునేలా గ్రామీణులకు వివరించాలని కోరారు. మురుగు కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని స్పష్టం చేశారు. అనంతరం డ్రైనేజీల్లో చెత్తాచెదారాలను జేసీబీతో తొలగించారు.





విజయపురం : వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది, పాలసముద్రం : మురుగు తొలగిస్తున్న జేసీబీ

పాము కాటుకు మహిళ మృతి



శాంతి కుమారి (ఫైల్)

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామ పంచాయతీ మిట్టూరుకు చెందిన శాంతి కుమారి(43) శుక్రవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం పంట పొలాల్లో ఆవులు, మేకలు మేపుకుంటున్న శాంతికుమారి ఇంటికి వస్తుండగా పాము కాటు వేసింది. దీంతో స్థానికులు నగరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందింది. ఆమె భర్త జయశంకర్ గతంలోనే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఆ పిల్లలిద్దరూ అనాథలుగా మారారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

పుత్తూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ తిరుమలరాజు అన్నారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయన శనివారం మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్‌ఎం సునీత, మండల కో–ఆర్డినేటర్ నందకుమార్, జోనల్ సెక్రటరీ గోపికృష్ణ, పీడీలు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలి

విజయపురం : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత లేకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని పాతర్కాడు అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో 0–5 ఏళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు చూస్తారని తెలిపారు. కేంద్రంలో వారికి ఇచ్చే గుడ్లు, పాలు ఇతర పౌష్టికాహారం వలన వారు ఎత్తు బరువు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. తల్లిదండ్రులు కూడా ఇంటిలో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భవతులు పాల్గొన్నారు.



పాతర్కాడులో మాట్లాడుతున్న లక్ష్మి

మహనీయుడు గురజాడ అప్పారావు





పుత్తూరు: మాట్లాడుతున్న మస్యం నరసింహులు, వెదురుకుప్పం: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: భాషా సంస్కరణతో పాటు సాంఘిక సంస్కరణలు చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.వీరయ్య అన్నారు. కళాశాలలో శనివారం గరుజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ మస్యం నరసింహులు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యానికి యుగకర్త గురజాడ అని కొనియాడారు. ఆయన రచించిన కన్యాశుల్కం గొప్ప సాంఘిక నాటకమని, దీని ద్వారా సమాజంలోని దురాచారాలను ఎత్తి చూపారని తెలిపారు. బాల్య వివాహాలను వ్యతిరేకించడంతో పాటు, వితంతువుల వివాహాలను ప్రోత్సహించిన మానవతావాది అని కొనియాడారు. తన రచనల ద్వారా సామాజిక మార్పునకు, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. గురజాడ దేశభక్తి గేయాన్ని విద్యార్థులతో కలిసి ఆలపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాణిశ్రీ, హరిబాబు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

వెదురుకుప్పం : గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని శనివారం చవటగుంటలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ సాంఘిక దురాచారాలపై పోరాటం సాగించిన నవయుగ వైతాళికుడు గురజాడ అని కొనియాడారు. మహిళల అభ్యున్నతే లక్ష్యంగా అవిశ్రాంతంగా శ్రమించిన మహనీయుడని తెలిపారు. దేశమును ప్రేమించుమన్న మంచి అన్నది పెంచుమన్నా అనే గేయం ద్వారా ప్రజల్లో దేశ భక్తిని తట్టిలేపారని వివరించారు. ప్రధానంగా ఆయన రచించిన కన్యాశుల్కం ఇప్పటికీ సమాజాన్ని ఆలోచింపజేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షుడు భీమమోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రారంభమైన పెరటాసి తొలి పూజలు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి నెల తొలి శనివారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెరటాసి నెలను పురస్కరించుకొని ఆలయ ఆవరణలో భక్తులు పిండి దీపాలు వెలిగించడానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చకులు వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



ఊరేగింపుగా వెళుతున్న మేరీమాత

కిక్కిరిసిన వేంకటేశ్వర స్వామి ఆలయాలు

నగరి : పెరటాసి నెల తొలి శనివారం కావడంతో వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సమీపంలో పూజా సామగ్రి విక్రయాలకు ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. టీడీడీ ఆధీనంలో ఉన్న నగరి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయం, సత్రవాడలోని కరివరదరాజ స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు టీటీడీ వారితో పాటు భక్తులు ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా తేరు ఊరేగింపు

మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం నుంచి పట్టణంలోని ఆరోగ్యమాత ఆలయం వరకు శనివారం రాత్రి తేరు ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. నవ దినోత్సవాలను పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు యేసునాథుని, మేరీమాతను తేరులో ఉంచి ఊరేగించారు. బాణసంచా వేడుకలు, ప్రార్థనల నడుమ ఊరేగింపు వైభవంగా సాగింది. వివిధ రూపాల్లో అలంకరించిన తేరును చూడటానికి స్థానికులు ఆసక్తి చూపారు. ఆరోగ్య మాత ఆలయం వరకు ఊరేగింపు కొనసాగించిన క్రైస్తవులు చర్చిలో ప్రార్థనలు చేశారు.

నృసింహునికి విశేష పూజలు



అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో తిరువని శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.







కరియమాణిక్య స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు, ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు, తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

అదృశ్యమైన వ్యక్తి ప్రత్యక్షం

నగరి : మున్సిపల్ పరిధి ఎంకేకే కండ్రిగలో నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన అంజయ్య అనే వ్యక్తిని సీఐ మహేశ్వర్ కనుగొని తహసీల్దార్ రవికుమార్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు కరువు

విజయపురం : మండలంలో చేతిపంపు మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారింది. ఫలితంగా విద్యుత్ మోటార్ మరమ్మతుకు గురైనప్పుడు ప్రజలు తాగునీటి కష్టాలు పడుతున్నారు. మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉండగా అందులో సుమారు 30కి పైగా చేతిపంపులు పని చేయడం లేదని తెలిసింది. ఈ చేతిపంపులను సరిచేస్తే బాగుటుందని గ్రామస్తులు కోరుతున్నారు. అంతే కాకుండా విద్యుత్ లేని సమయంలో కూడా తాగునీటి సమస్య రాకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ చేతి పంపుల మరమ్మతులకు అవసరమైన పైపులు కొనుగోలు చేశామని, త్వరలో చేతిపంపులను మరమ్మతు చేసి తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు.



మరమ్మతుకు గురైన చేతిపంపు

28 నుంచి కీలపట్లలో పవిత్రోత్సవాలు

తిరుపతి(అలిపిరి): కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామివారి ఆలయంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు శనివారం టీటీడీ అధికారులు తెలిపారు. 27న సాయంత్రం పుణ్యాహవచనం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. 28వ తేదీ రక్షబంధనం, పవిత్ర ప్రతిష్ఠ, శేయాధివాసం, 29న ఉదయం స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ, సాయంత్రం పవిత్ర హోమం, తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. 30న ఉదయం హోమాలు, సాయంత్రం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భక్తి సంగీతం, హరికథ, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పుష్ప శోభితం !





ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలో శనివారం జరిగిన వరసిద్ధి వినాయక స్వామి పుష్పపల్లకి ఉత్సవానికి ఆలయం పుష్పశోభితమైంది. విదేశీ పుష్పాలు, ఫలాలతో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అన్వేటి మండపం, ధ్వజస్తంభం, ఆలయ పరిసరాలు, సుపథ మండపం, ఆలయ విమాన గోపురాన్ని ముస్తాబు చేసి పుష్పతోరణాలు కట్టారు. ఆలయ ముఖద్వారం నుంచి గోపురం వరకు పుష్పాలంకరణలు కనువిందు చేశాయి. –కాణిపాకం





